
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 282 | అక్టోబర్ 14, 2025 | వెల : రూ.3-00



కేంద్రం నుంచి భారీ నిధుల ఆమోదం

3లో..



## సంక్షేమ హాస్టళ్లకు
# రూ.60 కోట్లు

- సీఎంఆర్ఎఫ్ నుంచి అలాట్
- ఫండ్స్ చెక్కు అధికారులకు సీఎం అందజేత
- కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచూ హాస్టళ్లను సందర్శించాలి : రేవంత్



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 60 కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయా శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.


**– వెల్ఫేర్ హాస్టళ్లపై ఫోకస్**

రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపుకు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా, జవాబుదారీతనం ఉండాలని చెప్పారు. ఈ సందర్భం గా అధికారులకు పలు సూచనలు చేశారు. "విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను తెలుసుకునేందుకు యాప్‌ను ఉపయోగించాలి. విద్యార్థులకు సరైన పోషకా లతో కూడిన నాణ్యమైన, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని దాంతో వారికి లభించే కేలరీలను తెలుసుకోవా లన్నారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫాంలు, పుస్తకాలు సకాలంలో సక్రమ ంగా అందేలా సీనియర్ అధికారులు చూసుకోవాలన్నారు.

**– సమాచారం 'అప్'టు'డేట్'**

హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర

మిగతా 3వ పేజీలో..



## ప్రభుత్వ భూముల కబ్జాలపై
# చర్య తీసుకోవాలి

**వేద న్యూస్, టేక్మాల్ :**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని పలు సోలార్ ప్లాంట్లు , కంపెనీలు ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జాలు చేసిన వారిపై తగు తీసుకోవాలని ఆందోల్ నియోజకవర్గ సింగూరు జలాల సాధన సమితి అధ్యక్షుడు కంచరి బ్రహ్మం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. టేక్మాల్ మండల పరిధిలో గల వివిధ సోలార్ ప్లాంట్లు కంపెనీ.. ప్రభుత్వ భూములు అనగా పేద ప్రజలకు పంపిణీ చేసిన అసైన్మెంట్, ఇతర ప్రభుత్వ భూములు సర్వే. నంబర్లు 30, 34, 108 గల గ్రామ శివారులో భూములున్నాయి.

2005 సంవత్సరంలో ప్రభుత్వం వారు పేద ప్రజల అభివృద్ధి కోసం సుమారు 100 పైగా లబ్ధిదారులకు భూపంపిణీ కార్యక్రమంలో భాగంగా పట్టాలు ఇచ్చారు. కాగా వారికి " పోజిషన్ , కబ్జాలు చూపించలేదు. భూములను సదురు సోలార్ ప్లాంటు భీమా గ్రామ శివారులలో వారి ప్లాంట్లు విస్తరించే ఉద్యశంతో అక్రమంగా. కబ్జాలు చేసి ఈ భూములు పేద ప్రజలకు దక్కకుండా చేసి అటు ప్రభుత్వానికి ఎటువంటి రుసుములు చెల్లించకుండానే కొన్ని కోట్ల కోట్ల రూపాయలు సొమ్ముచేసుకున్నారు. కావున ఇట్టి భూములను – పేదప్రజలకు పంపిణీ చేయబడ్డ లబ్ధిదారులకు పోజిషన్లు చూపించే విధంగా సోలార్ ప్లాంట కబ్జాల నుండి విడిపించి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. కేవలం పై గ్రామ శివారులోనే కాకుండా ఎలకుర్తి, పల్వంచ, టేక్మాల్ గ్రామ శివార్లలలో కూడా పలు ప్రభుత్వచములు, నక్ష బాటలు, కాలువు కబ్బాలు చేసినట్లు స్తానికులు తెలిపినారు తమరు దయచేసి వెంటనే తగు చర్యలు తీసుకుని ప్రజలకు, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

## రాకేష్ కిషోర్ పై దేశద్రోహం
# కేసు నమోదు చేయాలి




**వేద న్యూస్, హనుమకొండ :**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి పైన దాడి చేసిన రాకేష్ కిషోర్ పైన దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల హనుమకొండ జిల్లా ఇన్చార్జ్ కందుకూరి సోమన్న మాదిగ డిమాండ్ చేశారు.సోమవారం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఇన్చార్జి

మిగతా 3వ పేజీలో..

## అనుమతులు లేని రిసార్ట్ వ్యవహారంపై
# అధికారుల నిర్లక్ష్యం?



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం, సిరికొండ గ్రామ శివారులో ఓ రిసార్ట్ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహించడం జరుగుతు ఒదన్న విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. మండల ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం ఈ రిసార్ట్ నిర్మాణానికి గ్రామపంచాయతీ నుండి గానీ, పర్యావరణ శాఖ తో పాటు వివిధ శాఖల అనుమతులు గానీ, ఎలాంటి నిర్మాణ లైసెన్స్ లాంటి చట్టబద్ధమైన పత్రాలు లేవని సమాచారం. దీనిపై సమాచార హక్కు చట్టం ప్రకారం గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా, ఆ రిసార్ట్ కు ఎలాంటి అనుమతులు లేవని ఆ అధికారి సైతం లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడం జరిగిందన్నారు. అయితే ఆ కార్యదర్శి బదిలీపై వేరే ప్రాంతంకు వెళ్లగా మరోసారి స్థానికులు దీనిపై ప్రస్తుతం ఉన్న కార్యదర్శిని వివరణ కోరారు. గతంలో ఉన్న కార్యదర్శి ఏం చేశాడో నాకు తెలియదు అని నిర్లక్ష్యం సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇంత పెద్ద నిర్మాణం జరిగి, ఇంత పెద్ద వ్యవహారం నిర్వహిస్తున్న కూడా దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎందుకు మౌనం వహిస్తున్నారని? ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక సామాన్యుడు ఇల్లు కట్టుకుంటేనే ఈ అనుమతులు, ఆ అనుమతులు అంటూ, ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిప్పుకునే అధికారులకు మరి ఇంత పెద్ద రిసార్ట్ నిర్వహణలో మాత్రం వీరికి అనుమతులు గుర్తు రాలేదా? అని అడుగుతున్నవైనం. ఈ విషయం స్థానిక ఎంపిఓ, ఎంపీడీవో దృష్టికి తీసుకుపోయి ఎన్నిసార్లు అడిగినా కూడా ఫలితం మాత్రం శూన్యంగా ఉందని మండి పడుతున్నారు. అసలు ఈ రిసార్ట్ యజమానికి పంచాయతీరాజ్ అధికారులకు మధ్య ఉన్న ఉన్న సంబంధం ఏంటి..? ఎందుకు మౌనంగా ఉంటున్నారు అనే అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. కాగా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రిసార్ట్ పై, దాని యాజమాన్యంపై, అదేవిధంగా ఈ విషయంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక పంచాయతీరాజ్ శాఖ అధికారులపై కూడా సంబంధిత శాఖ ఉన్నత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## కిడ్నీ మార్పిడి
# సేవలకు గౌరవం



**– యశోద ఆసుపత్రుల కార్యక్రమానికి హాజరైన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

డెస్క్ : హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన "300కి పైగా ప్రాణ రక్షక కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల వెనుక ఉన్న వైద్య వీరులకు సత్కారం" కార్యక్రమం మరియు "దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల ప్రావీణ్య కేంద్రం" ప్రారంభోత్సవానికి రాష్ట్ర

మిగతా 2వ పేజీలో..

## జూబ్లీహిల్స్‌లో
# చోరీ ఓట్ల స్కాం

**– కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు**



డెస్క్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తప్పుడు పద్ధతులతో గెలవాలని చూస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ ఓటు చోరీ గురించి మాట్లాడుతుంటే, ఇక్కడ మాత్రం కాంగ్రెస్ పార్టీ చోరీ ఓట్లతో విజయం దక్కించుకునేందుకు

మిగతా 2వ పేజీలో..

## పూరన్ కుమార్ కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ

డెస్క్ : చండీఘడ్‌లో ఆత్మహత్య చేసుకున్న దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈరోజు (సోమవారం) పరామర్శించారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను డిప్యూటీ

మిగతా 3వ పేజీలో..

## మేడారం జాతరకు
# రూపురేఖలు మారుతున్నాయి

**– రూ.251 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులకు శ్రీకారం**



డెస్క్ : అశేష భక్తులు ఆరాధించే వన దేవతలైన శ్రీ సమ్మక్క – సారలమ్మ మేడారం జాతర ప్రాంగణం రూపురేఖలను మార్చే విధంగా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ మహాజాతరను కేవలం సీజనల్ ఈవెంట్‌గా కాకుండా శాశ్వత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ క్రమంలో మొత్తం రూ.251 కోట్ల నిధులతో రోడ్లు,

మిగతా 3వ పేజీలో..

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

**వేద న్యూస్, టేక్మాల్ :**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించనున్నట్లు సొసైటీ ఛైర్ పర్సన్ యశ్వంత్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన టేక్మాల్ లోని సహకార సంఘం గోదాం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లను సోమవారం చేశారు. గోదాం పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి స్థలాన్ని చదును చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ధనూర, టేక్మాల్, పల్వంచ, కోరంపల్లి, బర్ధిపూర్, చంద్రుతాండ, ఎలకుర్తి, కాదులూర్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ వరి ధాన్యాన్ని అమ్ముకోవాలని, ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి మోసపోవద్దన్నారు. రైతుల శ్రేయస్సు, సంక్షేమం కోసం టేక్మాల్ సొసైటీ నిరంతరం పని చేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఇంకా ఎక్కడైనా అవసరమైతే తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సొసైటీ సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు కిషన్, శ్రీశైలం, పలువురు నాయకులు, రైతులు ఉన్నారు.



# మిత్రునికి ఆర్థిక చేయూత

**వేద న్యూస్, హనుమకొండ :**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి స్నేహితులు ఆపన్న హస్తం అందించారు. ఆపదలో మేమున్నాం మిత్రమా అని ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. కేవలం ఆనందాలు పంచుకోవడమే కాదు కష్టాన్ని కూడా పంచుకునే వారే స్నేహితులు అని నిరూపిస్తున్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్ కి చెందిన రాజోజు రామచంద్రాచారి నెలరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ఆసుపత్రి పాలయ్యారు. ఆయన పరిస్థితి ఆర్థికంగా చాలా దీనావస్థలో ఉంది. ఈ విషయం తెలుసుకున్న తనతో చదువుకున్న మిత్రులందరూ "ఆపదలో మేమున్నాం.." అంటూ తన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40 వేలు రాజోజు రామచంద్ర చారి కుటుంబానికి అంద జేశారు. ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటూ స్నేహమంటే కలిసి నవ్వుకోవడమే కాదు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం అని నిరూపించినందుకు మిత్రులందరికీ రామచంద్ర చారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్న మహేందర్, బుస్స శ్రీనివాస్, ఏదుల మనోహర్ , డి.సంజీవరావు, పైండ్ల శంకర్ ఐలి సురేందర్, కోకిల బిక్షపతి, కోగిల చంద్రమౌళి, బత్తుల వీరభద్రమ్ తదితరులు పాల్గొన్నారు.



# 'లిపిడ్' టెస్ట్ మస్ట్!

- సర్కారీ దవాఖానల్లో సదరు పరీక్షలు అందుబాటులో..
- ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలి
- ఇల్లందకుంట మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తులసీదాస్

**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ప్రస్తుతం గుండెపోటు మరణాలు ఎక్కువయ్యాయి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా చాలా మంది హఠాత్తుగా గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తున్నది. తమిళనాడు చెన్నైకు చెందిన కార్డియాక్ సర్జన్ సైతం గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో పలువురు గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలని ఇల్లందకుంట మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తులసీదాస్ పేర్కొన్నారు.

**- వ్యాయామం చేయాలి**

అందుబాటులో ఉన్న సర్కారీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యువతి యువకులతో పాటు అందరూ తప్పనిసరిగా లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్ చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్ ద్వారా శరీరంలోని కొలెస్ట్రాల్ ఏ మేరకు ఉంది అనేది స్పష్టంగా తెలుస్తుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఉదయం వేళలో వ్యాయామం చేయాలని, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని వెల్లడించారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవనంలో శారీరక శ్రమ తగ్గి మానసిక ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో.. సమతుల్యత పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఖాళీ ప్రదేశాల్లో ఉన్న పాత వాటర్ ట్యాంకులలో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ప్రతి మంగళవారం శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని క్రమంగా కొనసాగించాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



# జూబ్లీహిల్స్‌లో చోరీ ఓట్ల స్కాం

అనైతిక మార్గాలను అనుసరిస్తోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో భారీగా డూప్లికేట్ ఓట్లు, దొంగ ఓట్లు నమోదయ్యాయని, ఈ అవకతవకలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. అనంతరం పార్టీ కీలక నేతలతో కలిసి మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ నేతలు పరిపాలన యంత్రాంగాన్ని రాజకీయ లాభాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఉప ఎన్నికను ఏ రీతినైనా గెలవాలని కాంగ్రెస్ నేతలు అన్ని రకాల దందాలు చేస్తున్నారని, రాష్ట్ర క్యాబినెట్ మొత్తాన్ని జూబ్లీహిల్స్‌లో క్యాంప్ చేయించి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఒక వైపు తమే నిధుల కేటాయింపులపై ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాసి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ, ఇప్పుడు జూబ్లీహిల్స్‌కు అకస్మాత్తుగా పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు హామీలు ఇస్తున్నారని ప్రజలను మరోసారి మోసం చేసే యత్నంగా పేర్కొన్నారు. ఇలాంటి అవకతవకలకు గట్టి ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని, ప్రజాస్వామ్య ప్రక్రియను కాలరాసే అలవాటే కాంగ్రెస్ పార్టీ అసలు ముఖమని కేటీఆర్ ముద్ర వేశారు.

కేటీఆర్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఈ ఓటు చోరీ కుట్ర కేవలం ఒక నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాదని, ఇది రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలనే కాంగ్రెస్ పార్టీ వ్యూహానికి భాగమని ఆరోపించారు. ఓటర్ల నిజమైన హక్కులను ?నగొట్టే ప్రయత్నం ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి చేయడమేనని ఆయన పేర్కొన్నారు. నిజమైన ఓటర్ల ధ్వనిని నకిలీ ఓట్లతో మూయించే ప్రయత్నం చేస్తే బీఆర్ఎస్ మౌనంగా ఉండదని హెచ్చరించారు. జనాభా రిజిస్టర్, ఆధార్, ఓటర్ల జాబితా ు ఇవన్నీ ప్రజల ప్రామాణిక సమాచారాన్ని భద్రపరిచే పత్రాలు కావాలి గానీ, సొంత లాభం కోసం మార్పులు చేస్తే అది నేరమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఓట్ చోరీని అడ్డుకుందాం

- ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం
- కాంగ్రెస్ నేతల అవగాహన సంతకాల సేకరణ ప్రోగ్రామ్



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఏఐసీసీ, పిసిసి , డిసిసి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అవగాహన పెంచేందుకు "ఓట్ చోరీ" పేరిట సంతకాల సేకరణ కార్యక్రమం, ప్రదర్శనలు నిర్వహిస్తోంది. సోమవారం ఇల్లందకుంట మండల కేంద్రంలో ఈ ప్రోగ్రామ్ ను కాంగ్రెస్ లీడర్లు చేపట్టారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీకి వ్యతిరేకంగా పోరాడుతున్నారని, ఓటు చోరీతో దేశాన్ని పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలతో దేశ ప్రజలను దయనీయమైన స్థితిలోకి నెడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పు అని, కాంగ్రెస్ పార్టీ దీన్ని తీవ్రంగా ఖండిస్తోందని వెల్లడించారు. ప్రజల ఓటు విలువను కాపాడే దిశగా మా పార్టీ ఈ అవగాహన కార్యక్రమం ప్రారంభించిందని తెలిపారు. "ఓటు చోరీ ఆపు - ప్రజాస్వామ్యాన్ని రక్షించు" అనే నినాదంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఈ అవగాహన సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, నాయకులు కనుమల్ల సంపత్, వంగ రామకృష్ణ, మేష రాజయ్య, గోరుకుంట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ కన్నెబోయిన తిరుపతి

- హుజూరాబాద్ జమ్మికుంట శాఖకు

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కన్నెబోయిన తిరుపతి సోమవారం ఐఎంఏ హుజురాబాద్, జమ్మికుంట మండలాల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హుజురాబాద్, జమ్మికుంట మండలాలకు సంబ ంధించిన ఎన్నికలను సోమవారం ఎన్నికల అధికారి డాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, డాక్టర్ తిరుపతి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా డాక్టర్ శ్రీనివాస్, కోశాధికారిగా విద్యాసాగర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐఎంఏ హుజురాబాద్, జమ్మికుంట మండలాల అధ్యక్షుడిగా ఎన్నికైన ఎంబీబీఎస్ డీఎన్‌బీ జీఎం డాక్టర్ తిరుపతి ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైద్య వృత్తిలో పనిచేస్తున్న వైద్యుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన తోటి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కిడ్నీ మార్పిడి సేవలకు గౌరవం

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రాణాలను కాపాడే సేవలు అత్యున్నతమైన మానవ సేవలని పేర్కొన్నారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో విజయం సాధించి, అనేక కుటుంబాలకు కొత్త జీవితాన్ని అందించిన యశోద ఆసుపత్రి వైద్య బృందం సేవలను ప్రశంసించారు. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన చికిత్స, ఆధునిక సదుపాయాలను అందించే దిశగా యశోద ఆసుపత్రి ముందడుగు వేస్తోందని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆసుపత్రి ప్రతినిధులు, రోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. యశోద ఆసుపత్రి ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటివరకు నిర్వహించిన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల ద్వారా 300 మందికి పైగా రోగులు కొత్త జీవితం పొందారని, ఇది వైద్య సిబ్బంది కృషికి నిదర్శనం అని తెలిపారు. అత్యాధునిక పరికరాలు, నిపుణులైన వైద్య సిబ్బంది సమన్వయంతో రోగులు త్వరగా కోలుకునే విధంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. మూత్రపిండ వ్యాధులు దేశంలో వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, సమయానికి గుర్తింపు, సరైన చికిత్స, వైద్యుల పర్యవేక్షణ అత్యవసరమని గవర్నర్ సూచించారు. ప్రజల్లో అవగాహన పెరిగితే మరెన్నో ప్రాణాలను కాపాడవచ్చుని, యశోద ఆసుపత్రి వంటి వైద్య సంస్థలు ముందుండి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

# పేదల జీవనోపాధి కోసం తెలంగాణ సమ్మిళిత కార్యక్రమం

డెస్క్ :హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను బ్రాక్ ప్రతినిధుల బృందం మర్యాద పూర్వకంగా కలిసి తెలంగాణ సమ్మిళిత జీవనోపాది కార్యక్రమం అమలుపై వివరాలు అందించింది. రాష్ట్రంలో అత్యంత పేద, వెనుకబడిన వర్గాల జీవితా లను ముందుకు తీసుకెళ్లడం కోసం ఈ కార్యక్రమాన్ని సెర్ప్ సహకారంతో అమలు చేస్తున్నట్లు వారు తెలిపా రు. ఇప్పటి వరకు మొత్తం 3,554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించామని, వీరిలో ఆదివాసీలు, జోగినీలు వంటి సామాజికంగా వెనుకబడిన వర్గాలు ఉన్నాయని నివేదికలో వివరించారు. ఎంపికైన మం డల మహిళా సమాఖ్యల ద్వారా 108 మంది నిపుణులను నియమించి, లబ్ధిదారులకు శిక్షణ, మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు అవసరమైన నైపుణ్యాలు నేర్పించి, ప్రోత్సాహకాలు, సౌకర్య పూర్వక రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించి, వారిని స్వయం ఉపాధి పొందే స్థాయికి చేర్చడమే ముఖ్య లక్ష్యమని ప్రతినిధులు తెలిపారు. దీర్ఘకాలి కంగా ఆదాయం వచ్చే మార్గాలను కల్పించి ఈ కుటుంబాలు ఆర్థికంగా స్వాభిమానం కలిగిన స్థితికి చేరుకోవాలని ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భేటీలో ప్రధాన ప్రతినిధులతో పాటు సెర్ప్ అధికారి దివ్యా దేవరాజన్ మంత్రి సీతక్కతో కలిసి సమావేశంలో పాల్గొని కార్యక్రమం పురోగతిని సమీక్షించారు.

# సంక్షేమ హాస్టళ్లకు రూ.60 కోట్లు

వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్ప టికప్పుడు డాష్‌బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. "హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలి. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలి. అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలి.." అని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, నిర్మాణ ఖర్చులు, ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ ని ఆదేశించారు. హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని అన్నారు. 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్ టెక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్‌లను రూపొందించాలని ఆదేశించారు. సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాకేష్ కిషోర్ పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

కందుకూరి సోమన్న మాదిగ మాట్లాడుతూ జస్టిస్ బి ఆర్ గవాయి మీద కోర్టులో జరిగిన దాడిని కేవలం అది ఆయన మీద జరిగిన దాడిగా కాకుండా యావత్తు భారతదేశంలో ఉన్న దళితుల మీద జరిగిన దాడిగా భారత రాజ్యాంగం మీద జరిగిన దాడిగా ఈ భారత దేశ న్యాయ వ్యవస్థ మీద జరిగిన దాడిగా చూస్తున్నట్టు ఆయన తెలిపారు. సిజెఐ పై దాడి చేసిన రాకేష్ కిషోర్ అనే లాయర్ కుల దురాహంకారంతోనే దాడి చేశాడని అది వ్యక్తిగత కక్షతోనే దాడి చేశాడని అర్థమవుతుందని అన్నారు. దానికి ఉదాహరణగా జస్టిస్ గవాయి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన తర్వాత ఎస్సీ ఎస్టీ బీసీలకు అనుకూలంగా మాట్లాడటానికి సుప్రీంకోర్టు మొదలుకుంటే జిల్లా కోర్టుల వరకు ఎస్సీ ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు ఉండాలని ఆయన పలుమార్లు మాట్లాడడాన్ని జీర్ణించుకోలేకనే అగ్రకులాలలోని కొంతమంది న్యాయవాదులు ఇలా కుల దురాహంకారంతో దాడులకు తెగపడ్డారని ఇది ఒక ఉదాహరణగా మనం చెప్పుకోవచ్చని. దేవుడు విషయంలోనే గవాయి తప్పుగా మాట్లాడారని అంటున్న లాయర్ అదే సుప్రీంకోర్టులో రామ మందిరం విషయంలో ఆనాడు తీర్పునిచ్చే న్యాయమూర్తులలో నలుగురు ఏ ధర్మం గురించి అయితే చెబుతున్నారో ఆ ధర్మంను అనుసరించే వారే అప్పుడు న్యాయ మూర్తులుగా ఉన్నారని అప్పుడు రాముడు ఇక్కడే జన్మించాడా అందుకు తగిన ఆధారాలు ఉన్నాయ ...? అని ఆ యొక్క న్యాయమూర్తులు అడిగినప్పుడు అది కూడా దేవుడి విషయమే కాబట్టి మరి అప్పుడు ఎందుకు రామ మందిరం విషయంలో వాదించే లాయర్లు ఆ న్యాయవాదుల మీద దాడి చేయలేదో ఇప్పుడు మాత్రమే గవాయి మీద దాడి ఎందుకు చేశారో ... ?? సమాజంలో ఉన్న దళితులందరూ మరియు మేధావులందరూ గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఈ కుల దురాహంకారాలు మానుకొని దళితుల మీద దాడులు చేసుడు మానుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా ఇలాంటి దాడులు ఆపకపోతే భవిష్యత్తులో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దేశంలో ఉన్న దళితులను అందర్నీ ఏకం చేసి దేశవ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

అనంతరం సుప్రీంకోర్టులో సీజేఐ మీద దాడి చేసిన వ్యక్తి పైన దేశద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని మరియు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి దాడులు మళ్లీ పునరావృతం కాకుండా ఉండడం కోసం బలమైన చట్టాలు తేవాలని విజ్ఞప్తితో కూడిన వినతి పత్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ ,ఎమ్మెస్ పి జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ ,ఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ ,ఎమ్మెస్పీ సీనియర్ నాయకులు ఆరేపల్లి పవన్ మాదిగ ,అక్కెనకుంట వెంకటస్వామి మాదిగ ,ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బొడ్డు శాంతి సాగర్ మాదిగ, అంకిళ్ల రాజమాదిగ, ఎమ్మెస్ పి జిల్లా ఉపాధ్యక్షులు బొక్కల నారాయణ మాదిగ,మాట్ల వెంకటస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా కార్యదర్శులు శనిగరపు రవీందర్ మాదిగ, సుంచు రజిని కుమార్ మాదిగ, మంద స్వరాజ్ మాదిగ మరియు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధం సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పూరన్ కుమార్ కుటుంబానికి డిప్యూటీ సీఎం పరామర్శ

సీఎం అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం పూరన్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్, కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడించారు ఉపముఖ్యమంత్రి. సీఎం రేవంత్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారని.. పూరన్ కుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారని ఈ సందర్భండి భట్టి విక్రమార్క తెలిపారు. పూరన్ కుమార్ సహచరి ఐఏఎస్ అమనీత్‌ను పరామర్శించడానికి వచ్చిన హర్యానా చీఫ్ సెక్రటరీ అనురాగ్ రస్తోగితో డిప్యూటీ సీఎం విక్రమార్క మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి సూసైడ్ నోట్ ఆధారంగా ఎంత పెద్ద వాళ్ళు ఉన్నా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించి పూరన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పూరన్ కుమార్ అత్యంత ప్రతిభావంతుడని.. ప్రసిద్ధి గాంచిన ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పట్టభద్రుడని.. ఐఐఎం అహ్మదాబాదులో చదివిన గొప్ప మేధావి అని కొనియాడారు డిప్యూటీ సీఎం. ఉన్నతాధికారుల కుల వివక్ష, వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవడం.. చాలా తీవ్రమైన అంశమన్నారు. పూరన్ కుమార్ సూసైడ్ నోట్ డైయింగ్ డిక్లరేషన్‌గా భావించాలని కోరారు. ఈ ఘటన జరిగి ఇన్ని రోజులు అయినా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. వృద్ధ తల్లిదండ్రులను, ఇద్దరు ఆడపిల్లలు ఉన్న పూరన్ కుమార్ కుటుంబానికి రక్షణ కల్పించి ఆదుకోవాలని హర్యానా ప్రభుత్వాన్ని, చండీఘర్ పోలీసులను డిమాండ్ చేశారు. కపూర్ అనే అధికారి దళిత వ్యతిరేకి అని తెలిసి కూడా బీజేపీ ప్రభుత్వం అతన్ని డీజీపీని చేసిందని.. ఈ ప్రభుత్వం ఇన్నేళ్ల స్వతంత్ర భారతదేశంలో డెత్ బెడ్ మీద ఉండి కూడా న్యాయం కోసం ప్రాధేయపడడం దురదృష్టం అంటూ భట్టి వ్యాఖ్యలు చేశారు.

అత్యంత పిన్న వయసులోనే ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత పూరన్ కుమార్ అని అన్నారు. అతని చివరి డెత్ లెటర్ ఆధారంగా సంబంధిత అధికారుల మీద చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. హర్యానా, చండీగఢ్ ప్రభుత్వాలు బీజేపీ పాలనలో ఉన్నాయని.. సీఎం రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్నారు. తాము చట్టాన్ని ధిక్కరించే పని అడగడం లేదని.. బాధ్యత గల ప్రభుత్వాలు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని అడుగుతున్నామన్నారు. తెలంగాణ సీఎం రేవంత్.. పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# మేడారం జాతరకు రూపురేఖలు మారుతున్నాయి





పార్కింగ్‌లు, తాగునీటి సౌకర్యాలు, ఘాట్‌లు, శు చీకరణ నిర్మాణాలు, యాత్రికులకు శాశ్వత వసతి గృహాలు వంటి మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. ములుగు జిల్లా మేడారం ప్రాంతంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్, ఎస్పీ, ఆలయ పురోహితులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతర ప్రాంగణానికి చేసిన పర్యటన అనంతరం తొలిదశలో 101 కోట్ల మంజూరు కాగా, గతంలో ఆమోదించిన 150 కోట్లతో కలిపి మొత్తం నిధులను దశలవారీగా వినియోగించనున్నారు. ఇప్పటికే 71 కోట్లకు పైగా పనులకు టెండర్లు పిలవబడగా, వచ్చే 50 రోజుల్లో అన్ని పనులు వ్యవస్థబద్ధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు జారీ అయ్యాయి.

ప్రతి సంవత్సరం లక్షలాది భక్తులు తరలివచ్చే ఈ జాతర ప్రాంగణంలో గతంలో కోటి మందికి పైగా రద్దీ నమోదైంది. ఈసారి ప్రభుత్వం చేపడుతున్న సదుపాయాల విస్తరణతో భక్తుల సంఖ్య రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గిరిజన మరియు గిరిజనేతర ప్రజల ఆరాధ్య స్థలంగా నిలిచే ఈ పవిత్ర క్షేత్రాన్ని శాశ్వత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని సీతక్క స్పష్టం చేశారు. "సమ్మక్క సారలమ్మల ఆశీర్వాదంతో మేడారాన్ని దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద గిరిజన జాతర కేంద్రంగా అంతర్జాతీయ పర్యాటక మ్యాప్‌లో నిలబెట్టడం మా లక్ష్యం" అని ఆమె తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన జరుగుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో రోడ్ల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. జంపన్న వాగు ప్రాంతంలో భారీగా ఏర్పడే రద్దీని దృష్టిలో పెట్టుకుని కొత్త బైపాస్ మార్గాలు, పార్కింగ్ జోన్లు, అత్యవసర సేవల కోసం ప్రత్యేక రక్షణ దళాల స్టేషన్లను ఏర్పాటు చేయాలని అధికారులు సిద్ధమవుతున్నారు. భక్తులు వర్షాకాలంలో ఎదుర్కొనే సమస్యలను నివారించేందుకు నీటి పారుదల కాల్వలు, శుద్ధి చేసిన తాగునీటి సరఫరా కేంద్రాలు, మొబైల్ వైద్య శిబిరాల ఏర్పాటుకు కూడా ప్రత్యేక బడ్జెట్ కేటాయించారు. ఇవన్నీ కాకుండా యాత్రికుల భద్రత, నియంత్రణ కోసం సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దివ్య దర్శనం పొందేందుకు ప్రత్యేక మార్గదర్శక కేంద్రాలు, సమాచారం బోర్డులు, డిజిటల్ హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులోకి రానున్నాయి. మేడారం జాతర కేవలం ఒక వార్షిక ఉత్సవంగా కాకుండా సాంస్కృతిక గిరిజన గుర్తింపుకు ప్రతీకగా నిలిచేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

# కేంద్రం నుంచి భారీ నిధుల ఆమోదం

## - ముఖ్య ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు - రవాణా రంగానికి కొత్త శకం ప్రారంభం

డెస్క్ : తెలంగాణ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. హ్యామ్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 431 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారుల నిర్మాణానికి ఆమోదం లభించింది. మొత్తం ఇరవై ఐదు వేల ఆరు వందల అరవై ఒక కోట్లు వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. కేంద్రం నలభై శాతం, నిర్మాణ సంస్థలు అరవై శాతం వ్యయం భరించనున్నాయి. దేశ వ్యాప్తంగా వంద ఇరవై నాలుగు జాతీయ రహదారి ప్రాజెక్టులకు అనుమతులు లభించగా, అందులో తెలంగాణకు ఐదు ప్రధాన మార్గాలు లభించడం రాష్ట్రానికి గర్వకారణంగా మారింది. అర్మూర్ నుంచి జగిత్యాల, జగిత్యాల నుంచి మంచిర్యాల్ వరకు నాలుగు లేన్లుగా విస్తరణ చేపట్టనున్నారు. జగిత్యాల నుంచి కరీంనగర్ మార్గం కూడా ఈ జాబితాలోనే ఉంది. అదనంగా మహబూబ్ నగర్ నుంచి రాయచూర్ దిశగా సాగుతున్న రహదారికి కూడా నిధులు కేటాయించారు.

**- ముఖ్య ప్రాజెక్టులకు భారీ కేటాయింపులు**

హైదరాబాద్ ప్రాంతీయ వలయ రహదారి నిర్మాణానికి పదిహేను వేల ఆరు వందల ఇరవై ఏడు కోట్లు కేటాయించారు. ఈ నూట అరవై కిలోమీటర్ల మార్గం పూర్తి అయితే నగర పరిసర రవాణాకు పెద్ద ఊరట లభిస్తుంది. మహబూబ్ నగర్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు ఉన్న రహదారి విస్తరణకు రెండువేల ఆరు వందల అరవై రెండు కోట్లు, జగిత్యాల నుంచి మంచిర్యాల్ మార్గానికి రెండువేల ఐదు వందల యాభై కోట్లు, అర్మూర్ నుంచి జగిత్యాల రహదారికి రెండువేల మూడు వందల ముప్పై ఎనిమిది కోట్లు, జగిత్యాల నుంచి కరీంనగర్ మార్గానికి రెండువేల మూడు వందల ఎనభై నాలుగు కోట్లు కేటాయించారు.

**- రవాణా రంగానికి కొత్త శకం ప్రారంభం**

ఈ ప్రాజెక్టులు పూర్తి అయితే రాష్ట్ర రవాణా వ్యవస్థకు కొత్త జీవం లభిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టూ రహదారులు విస్తరించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని అంచనా. పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం వంటి రంగాలకు రవాణా సౌకర్యాలు మరింత చేరువవుతాయని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రజలకు ఈ ప్రాజెక్టులు దీర్ఘకాలిక లాభాలు చేకూర్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకమైంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు రవాణా సులభతరం కావడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు వేగంగా మార్కెట్లకు చేరే అవకాశం ఉంటుంది. రైతులు తమ పంటలను సమయానికి విక్రయించుకోవడానికి ఈ రహదారులు ప్రధాన మార్గాలుగా మారవచ్చు. సరుకు రవాణా ఖర్చులు తగ్గటం వల్ల రైతులకు అదనపు లాభం చేకూరే అవకాశం ఉంటుంది. పర్యాటక రంగానికి కూడా ఈ రహదారుల నిర్మాణం కొత్త అవకాశాలు తెరుస్తుందని అంచనా. జిల్లాల మధ్య రాకపోకలు మెరుగుపడితే పర్యాటక ప్రాంతాలకు చేరుకోవడం మరింత సులభతరం అవుతుంది. కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల్ వంటి ప్రాంతాల్లో ఉన్న సహజ, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలు మరింత మంది సందర్శకులను ఆకర్షించే అవకాశం ఉంది.



నిర్మాణ రంగానికి ఈ భారీ ప్రాజెక్టులు ఉపాధి అవకాశాలను తీసుకొస్తాయి. వేలాదిమంది కార్మికులకు ఈ పనులు ఉపాధి మార్గాలను అందిస్తాయని అంచనా. స్థానిక కాంట్రాక్టర్‌లు, నిర్మాణ సామగ్రి సరఫరాదారులకు కూడా ఈ ప్రాజెక్టులు ఆర్థిక లాభాలను అందిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న వ్యాపారాలకు కూడా వేగం చేరుతుంది.

ప్రభుత్వ విభాగాలు, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పని చేస్తే ఈ ప్రాజెక్టులు నిర్ణీత గడువుల్లో పూర్తి అయ్యే అవకాశం ఉంటుంది. నాణ్యతపై దృష్టి సారిస్తే రహదారులు దీర్ఘకాలం పాటు ప్రజలకు ఉపయుక్తం అవుతాయి. అభివృద్ధి పనుల ద్వారా రాష్ట్రానికి కొత్త రవాణా దశ ప్రారంభమవుతుందని ప్రజల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.

# అంతరిస్తున్న 'భారతీయ తోడేలు'



భారతదేశంలోని పాక్షిక-శుష్క మైదానాలు, పొద భూముల విస్తీర్ణంలో నివసించే అద్భుతమైన, పురాతన జీవి భారతీయ తోడేలు (ఇండియన్ వోల్ఫ్ -కానిస్ లూపస్ పల్లిప్స్. ఈ తోడేళ్ల జాతి సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నది. 2023-24 భారతీయ పరిశోధనల అంచనా ప్రకారం 2,877-3,310 వరకు ఉంటుందని సమాచారం. అంతరించి పోతున్న జాతులుగా గుర్తించిన ఈ తోడేళ్ల జాతిని అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సమితి (ఐయూసీఎన్) ఈ నెల 10 న వీటిని ప్రమాదంలో ఉన్న జాతుల జాబితాలో చేర్చింది. భారతదేశంలో బూడిద రంగు తోడేలు పురాతన మనుగడ వంశాలలో ఒకటైన ఈ అంతుచిక్కని ప్రెడేటర్, వేల సంవత్సరాలుగా భారత ఉపఖండంలో తిరుగుతూ, పర్యావరణ వ్యవస్థలను మాంసహారిగా సమన్వయపరుస్తూ, ఆహారం, ప్రెడేటర్ మధ్య సున్నితమైన సమతుల్యతను సాధిస్తోంది. భారతదేశ వన్యప్రాణుల రక్షణ చట్టం (డబ్ల్యూఎల్పీఏ) 1972 ప్రకారం దాని పర్యావరణ ప్రాముఖ్యత, చట్టపరమైన రక్షణ ఉన్నప్పటికీ, ఈ జాతి ఇప్పుడు మనుగడ కోసం పోరాడుతోంది. అంతరించిపోతున్న జాతుల జాబితాలోకి (ఎండేంజర్డ్ స్పీసిస్ లిస్ట్ లోకి) ఇటీవల చేర్చబడింది. దీని ఈ కథ కేవలం అంతరించిపోయే ప్రమాదం గురించి కాదు.. ఇది భారతదేశ పరిరక్షణ విధానాలు, ఇప్పటికీ ఎక్కువగా అటవీ-కేంద్రీకృతమై, దాని అత్యంత ప్రతికూల (బెదిరింపు) పర్యావరణ



వ్యవస్థను, గడ్డి భూములను పరిస్థితులను ఎలా విస్మరించాయో ప్రతిబింబించే అద్దంలో వలె కనిపిస్తోంది. భారతీయ తోడేలు సంఖ్య తగ్గుతోందనేది సమాజంలోని అన్ని మూలల నుండి శ్రద్ధ, సానుభూతి, సమన్వయ చర్యను కోరుకునే అత్యవసర పర్యావరణ, నైతిక సవాలును సూచిస్తుంది.

**- భారతీయ తోడేలు అంతరించడానికి ముఖ్య కారణాలు:**

భారతీయ తోడేలు అంతరించడానికి ప్రధాన కారణాలు దాని ఆవాసాలను స్వార్ధ అభివృద్ధి ముసుగులో, అక్రమ ఆక్రమణలా దిశగా క్రమబద్ధంగా నాశనం చేయడం, విచక్షణ కోల్పోయి తప్పుగా అర్థం చేసుకోవడం, పెరుగుతున్న మానవ ఒత్తిళ్లతో పాటు, వ్యవసాయ, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల విస్తరణలో బహిరంగ మైదానాలు.. పొడి గడ్డి భూములు క్రమంగా కనుమరుగవుతున్నందున, తోడేలు తన ప్రపంచం వేగంగా కుంచించుకుపోతున్నట్టు గుర్తించబడింది.

**- ఆవాస, నివాస విధ్వంసం,విచ్ఛిన్నం:**

తోడేలు తమ పూర్వీకుల నివాసమైన సవన్నా, పొదలు తరచుగా అధికారిక రికార్డులలో "బంజరు భూములు" గా ముద్రించబడ్డాయి. ఈ అధికారిక తప్పుడు వర్ణన, వ్యవసాయం, మైనింగ్, రోడ్లు, పవన విద్యుత్ ప్రాజెక్టుల కోసం వాటిని విస్తృతంగా మార్చడానికి దారితీసింది. అటవీ పర్యావరణ వ్యవస్థల మాదిరిగా కాకుండా, ఈ బహిరంగ ఆవాసాలు అరుదుగా అధికారిక రక్షణను పొందుతాయి, తోడేళ్ల గుంపులను వేరుచేసే, సంతానోత్పత్తిని పరిమితం చేసే ఆవాస విచ్ఛిన్నానికి గురవుతున్నాయి. ఒకప్పుడు తోడేళ్ల గుంపులు స్వేచ్ఛగా సంచరించడానికి అనుమతించిన పెద్ద నిరంతర గడ్డి భూములు, వ్యవసాయ భూములు, పట్టణాల మధ్య డిస్‌కనెక్ట్ చేయబడిన ద్వీపాలుగా తగ్గించబడ్డాయి. ఆవాస కారిడార్లు లేకుండా, గుంపుల మధ్య జన్యు మార్పిడి తగ్గుతుంది, జాతులు స్థానిక విలుప్తానికి గురవుతున్నాయి.

**- సహజ ఆహారం క్షీణించడం మరియు పెరుగుతున్న సంఘర్షణ:**

ఆవాసాల క్షీణత కారణంగా బ్లాక్‌బక్, చింకారా, ఇండియన్ హేర్ వంటి స్థానిక శాకాహారుల నష్టం తోడేళ్లు తమకు ప్రత్యామ్నాయ ఆహారంగా దేశీయ పశు వుల వైపు మళ్లవలసి వచ్చింది. ప్రతిగా, ఇది స్థానిక పశువుల కాపరి సమాజాలతో పెరుగుతున్న సంఘర్షణకు ఆజ్యం పోసింది. మేకలు, గొర్రెలు లేదా లేగ దూడలపై ఆధారపడే గ్రామస్తులకు, తోడేళ్లను తరచుగా ప్రత్యక్ష ఆర్థిక ముప్పుగా చూస్తూ వాటిని చంపడానికి అనేక విధాలా ప్రయత్నిస్తున్న సంఘర్షణ తరుణం పెరిగిపోయి పశు కాపరుల చేతల్లో వీటి జాతి మరణిస్తూ తోడేళ్లు క్షీణిస్తున్నాయి. ప్రతీకార హత్యలు - ఎక్కువగా మృతదేహాలకు విషం ఇవ్వడం లేదా తోడేళ్లను బంధించడం ద్వారా వాటి మనుగడకు అత్యంత ముఖ్యమైన ముప్పుగా మారాయి. చట్టం ప్రకారం వాటికి రక్షణ హెూదా ఉన్నప్పటికీ, భారతదేశం అంతటా ప్రతి సంవత్సరం వందలాది తోడేళ్లు చంపబడుతున్నాయి, ఈ పురాతన జాతి తరాలను నిశ్శబ్దంగా తుడిచిపెట్టుకు పోతున్నాయి.

**- వ్యాధి, జన్యు కోత:**

వ్యాధి, జన్యు కోత సమస్యలను మరింత తీవ్రతరం అయింది. ఒకే ప్రకృతి దృశ్యాన్ని పంచుకునే స్వేచ్ఛా-శ్రేణి పెంపుడు కుక్కల జనాభా అదుపు లేకుండా తిరుగుతున్నాయి. ఈ కుక్కలు కనైన్ డిస్టెంపర్ వైరస్ (సీడీవీ) రాబిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల వాహకాలుగా పనిచేసి మొత్తం తోడేళ్ల జనాభాను నాశనం చేస్తున్నాయి. తోడేళ్లు, కుక్కల మధ్య సంతానోత్పత్తి (హైబ్రిడైజేషన్) తోడేలు ప్రత్యేకమైన జన్యు గుర్తింపును క్షీణింపజేస్తుంది, భారతదేశ శుష్క వాతావరణం, వేట వర్ణపటానికి అనుగుణంగా పరిణామం చెందిన ఈ పురాతన ఉపజాతి సారాంశాన్నే క్షీణింపజేస్తున్నది.

**- రక్షణ, పునరుద్ధరణ మార్గాలు:**

భారతీయ తోడేలు మనుగడ రక్షిత ప్రాంత సరిహద్దులపై మాత్రమే ఆధారపడి ఉంటుంది. దీనికి అటవీయేతర పర్యావరణ వ్యవస్థలు, సహజీవన ఆధారిత పద్ధతులు మరియు సమాజ భాగస్వామ్యంతో పరిరక్షణ యొక్క పునఃరూపకల్పన ఆవశ్యకత ఎంతో అవసరం.

**- తోడేళ్ల ఆవాస, నివాస కేంద్ర రక్షణ:**

సంరక్షణ నివాస గుర్తింపుతో ప్రారంభం కావాలి. అటవీ శాఖ పెద్ద గడ్డి భూములను తోడేలు సంరక్షణ నిల్వలు లేదా కమ్యూనిటీ నిల్వలు గా గుర్తించి, తెలియజేయాలి, నిర్వహించాలి, వాటికి చట్టపరమైన హెూదా, అంకితమైన నిర్వహణ ప్రణాళికలను అందించాలి. ఈ ప్రాంతాలలో ఆహారం జాతుల పునరుద్ధరణ తోడేళ్ళకు స్థిరమైన సహజ ఆహార స్థావరం ఉందని నిర్ధారించుకొని, పశువులపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటుంది. గడ్డి భూములలో పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ జాతీయ ప్రాధాన్యతగా మారాలి. గడ్డి భూములు బంజరు ప్రాంతాలు కావు కానీ అత్యంత జీవవైవిధ్యం, కార్బన్-సమర్థవంతమైన పర్యావరణ వ్యవస్థలలో ఒకటి, తోడేలుకు మించి అనేక జాతులకు ఆవాసాలను అందిస్తాయి - వాటిలో బస్టర్డ్స్, కుందేళు ,,బ్లాక్ బక్స్ కీలకం.

**- సమాజ భాగస్వామ్యం ద్వారా సంఘర్షణ తగ్గింపు:**

ప్రభుత్వాలు పశువుల నష్టానికి న్యాయమైన వేగవంతమైన పరిహార పథకాలలో పెట్టుబడి పెట్టాలి. ఆలస్యం లేదా సరిపోని చెల్లింపులు పశువులపైన తోడేళ్ల దాడిలో నష్టపోయిన పశువుల యజమానుల్లో, పశువుల కాపారుల్లో నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. స్థానికులను ప్రతీకార హత్యల వైపు నడిపిస్తాయి. అదేవిధంగా, బలోపేతం చేయబడిన రాత్రి ఆవరణలు (బోమాస్), మెరుగైన లైటింగ్, సంరక్షక కుక్కల వాడకం విష ఆహార ఎర వంటి ప్రాణాంతక నిరోధకాలను ప్రోత్సహించడం వల్ల పశువుల వేట గణనీయంగా తగ్గుతుంది. సమాంతరంగా, తోడేళ్ల ప్రాంతాలలో, చుట్టుపక్కల వీధి కుక్కలకు టీకాలు వేయడం, స్టెరిలైజేషన్ డ్రైవ్‌లు తప్పనిసరి చేయాలి. ఇలాంటి నివారణ ఆరోగ్య ప్రయత్నాలు తోడేళ్లను మాత్రమే కాకుండా స్థానిక మానవ జనాభాను కూడా జూనోటిక్ వ్యాప్తి నుండి రక్షిస్తాయి.

**- సంరక్షణలో భాగస్వామ్య బాధ్యతలు:**

భారతీయ తోడేలును రక్షించడానికి బహుళ వాటాదారుల మధ్య సహకారం అవసరం. ప్రభుత్వ సంస్థలు, చట్టాల అమలు, న్యాయవ్యవస్థ, ప్రభుత్వేతర సంస్థలు, సాధారణ పౌరులు, ప్రతి ఒక్కరు తోడేళ్ల సంరక్షణ విషయంలో ప్రత్యేకంగా కానీ, పరోక్షంగా కానీ పరస్పరం అనుసంధానించబడిన బాధ్యతలను కలిగి ఉండాలి.

**- అటవీ శాఖ, రాష్ట్ర సంస్థలు:**

వన్యప్రాణుల సంరక్షకులుగా, అటవీ శాఖ పొదలు.. గడ్డి భూములను కలిగి ఉండటానికి సాంప్రదాయ అడవులకు మించి పరిరక్షణ ప్రయత్నాలను విస్తరించాలి. ఇందులో వేటపై కఠినమైన అమలు, సమర్థవంతమైన పరిహార నిర్వహణ, భూమిని సురక్షితంగా ఉంచడానికి, వ్యాధి వ్యాప్తిని తగ్గించడానికి రెవెన్యూ, వ్యవసాయం, పశువైద్య సేవల వంటి విభాగాలతో సమన్వయం ఉండాలి.

**- చట్టాలు, న్యాయ పర్యవేక్షణ:**

వన్యప్రాణుల రక్షణ చట్టం, 1972, దాని షెడ్యూల్ %×% వర్గీకరణ ద్వారా తోడేలుకు ఇప్పటికే అత్యున్నత స్థాయి చట్టపరమైన రక్షణను అందిస్తుంది. అయితే, వేట లేదా విషప్రయోగం కేసులలో స్థిరమైన న్యాయ విచారణ, వివరణ మరియు కఠినమైన శిక్షలు చాలా కీలకం. న్యాయవ్యవస్థ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్‌లు) ద్వారా కూడా చురుకైన పాత్ర పోషించాలి, ఇది కార్యనిర్వాహక సంస్థలను చట్టాలను అమలు చేయడానికి, పరిహార ప్రక్రియలను వేగవంతం చేయడానికి లేదా కీలకమైన ఆవాసాలలో పర్యావరణ విధ్వంసక ప్రాజెక్టులను నిలిపివేయడానికి నిలిచి బలవంత చట్ట అమలు చేసి శిక్షలు వేయాలి.

**- ఎన్జీవోలు, పౌర సమాజం:**

రాష్ట్ర ప్రయత్నాలను స్థానిక వాస్తవాలతో అనుసంధానించడం ద్వారా ప్రభుత్వేతర సంస్థలు తోడేలు సంరక్షణలో ముందు వరుస పాత్ర పోషించాలి. అట్టడుగు స్థాయి (కిందిస్తాయి) సంఘర్షణ తగ్గింపు కార్యక్రమాలు, అవగాహన ప్రచారాలు మరియు సమాజ భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా, అవి తమలో నమ్మకం, విశ్వాసం మరియు తమ జాతి సహజీవనాన్ని పెంపొందించుకుంటాయి. అనేక ఎన్జీవోలు గ్రామస్తులను "వోల్ఫ్ గార్డియన్స్" గా శక్తిమంతం చేయాలి. అటవీ ఆవాసం పక్కన ఉన్న స్థానిక గ్రామాలు యాజమాన్యం, పరిరక్షణలో ప్రమేయాన్ని నిర్ధారించుకొని వాటి సంరక్షనకొరకు ముందుకు సాగాలి. తోడేలు జీవావరణ శాస్త్రం, వ్యాధి ప్రభావం మరియు భూ వినియోగ మార్పుపై వారి పరిశోధన అనుకూల విధానాలను రూపొందించడంలో ఎంతో అవసరం.

**- పౌరుల విధులు:**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ(జీ) కింద వన్యప్రాణులను, పర్యావరణాన్ని రక్షించడానికి ప్రతి పౌరుడు రాజ్యాంగబద్ధంగా తప్పనిసరి విధిని పంచుకోవాలి. అటవీ ఆవరణాల సంరక్షణ, సహజవనరుల సంరక్షణ, అటవీ జీవుల పట్ల భూతదయ కలిగివుండాలి. ఈ విషయంలో పౌరులు, ముఖ్యంగా తోడేలు ప్రకృతి దృశ్యాలలో వాటి దగ్గరి ప్రదేశాలలో నివసించేవారు, ప్రతీకారం తీర్చుకోవడం కంటే సహనాన్ని పాటించాలి, స్టీవార్డ్‌షిప్ విధానాలను అవలంబించాలి. వన్యప్రాణుల నేరాలను నిరోధించేలా చేయడం, నివేదించడం, వాటి పరిరక్షణ కార్యక్రమాలలో సహకరించడం, గడ్డి భూముల చట్టపరమైన రక్షణకు మద్దతు ఇవ్వడం అనేవి సరళమైనవి. కానీ శక్తిమంతమైన చర్యలు, ఇవి కలిసి తోడేలు విధిని, వాటి జీవన విధానాన్ని మార్చగలవు.

**- సహజీవనం కోసం పిలుపు:**

భారతీయ తోడేలు మనుగడ అనేది సహజీవనం, పర్యావరణ న్యాయం గురించి ఒక పెద్ద సంభాషణకు చిహ్నం. దాని క్షీణత బహిరంగ, అటవీప్రాంతం కాని ఆవాసాలను డిస్ట్రక్షన్ (ఖర్చు) చేయదగినవిగా గుర్తించడం వల్ల కలిగే నష్టాన్ని నొక్కి చెబుతుంది. వాటి భవిష్యత్తును భద్రపరచుకోవడానికి, భారతదేశం పరిరక్షణ ప్రాధాన్యతలను అటవీ కోటలు నుండి జీవన ప్రకృతి దృశ్యాలు వైపు తిరిగి మళ్లించాలి, ఇక్కడ ప్రజలు, మాంసాహారులు సమతుల్యతతో స్థలాన్ని పంచుకోవచ్చు. ఒకప్పుడు భారతీయ తోడేలు అరుపు ఉపఖండంలోని అంతులేని మైదానాలలో ప్రతిధ్వనించింది, ఇది మానవ నాగరికతకు ముందు ఉన్న అరణ్య శబ్దం. నేడు, ఆ అరుపు మసకబారుతోంది. ఇది ప్రతిధ్వనిస్తూనే ఉంటుందా లేదా అనేది చట్టాలు మరియు సంస్థలపై మాత్రమే కాకుండా, గ్రామస్తులు, విధాన నిర్ణేతలు, పౌరుల ఎంపికల సమిష్టి మానవ సంకల్పంపై ఆధారపడి ఉంటుంది. భారతీయ తోడేలును రక్షించడం అంటే భారతదేశ గడ్డి భూముల ఆత్మను రక్షించడం, పరిరక్షణ విజయం వన్యప్రాణులను చుట్టుముట్టే గోడల ద్వారా కాదు, ప్రజలు మరియు ప్రకృతి మధ్య నిర్మించిన వంతెనల ద్వారా కొలవబడుతుందని గుర్తించడం. ఈ విధంగా ప్రతీ ఒక్కరు బాధ్యతగా నడుచుకుంటేనే అటవీ ఆవాసాలు, అందులో జీవిస్తున్న జీవులు, జీవుల మధ్య ఆహారపు గొలుసు సమతుల్యమై ఈ జీవులతో పాటుగా మొత్తం జీవవరణం నివాసయోగ్యంగా మారి తనంతటా తానే స్వీయంగా రక్షింపబడుతుంది.


**- రవి బాబు పిట్టల, పర్యావరణవేత్త, మాజీ సహాయ ఆచార్యులు, జేఎన్టీయూహెచ్, హైదరాబాద్, జాయింట్ సెక్రటరీ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ.**

# చక్కని జీవనశైలితో అనారోగ్యానికి చెక్

## - ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ ఆకుల

**వేద న్యూస్, జమ్మికుంట:**

చక్కని జీవనశైలితోనే అనారోగ్యానికి చెక్ పెట్టవచ్చని, కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ మేరకు తమ లైఫ్ స్టయిల్‌లో మార్పులు చేసుకోవడం ఉత్తమమని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఎంబీబీఎస్ ఎండీ జనరల్ మెడిసిన్ వెల్లడించారు. ముఖ్యంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, డిజిటల్ డిటాచ్‌మెంట్ అవసరమని చెప్పారు. ప్రాసెస్డ్ ఫుడ్, జంక్ ఫుడ్ ఎక్కువ మొత్తంలో తీసుకుంటే ఊబకాయ సమస్యలు వచ్చే అవకాశాలుంటాయని స్పష్టం చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలిపై డాక్టర్ ఆకుల శ్రీనివాస్ పలు సూచనలు చేశారు.



**- 6 నుంచి 8 గంటల నిద్ర తప్పనిసరి**

ప్రతి ఒక్కరికి 6 నుంచి 8 గంటల పాటు నిద్ర ఉండాల్సిందేనని డాక్టర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆహారం మితంగా తీసుకోవాలని, ఫాస్ట్ ఫుడ్(జంక్ ఫుడ్) అవాయిడ్ చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశు భ్రత ప్రధానమని చెప్పారు. ఉరుకుల పరుగుల జీవనవిధానంలో డిజిటల్ డివైజెస్‌తోనే మొత్తంగా కాలం వెల్లదీయకుండా హాయిగా ప్రకృతిలో కొంత సమయం గడపాలని, కుటుంబ సభ్యులతో కొంత సమయం గడపాలని పేర్కొన్నారు. శారీరక శ్రమ క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ అరగంట పాటు వ్యాయామం చేయడం ఉత్తమమని స్పష్టం చేశారు.

# కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

డెస్క్ : సీనియర్ నాయకుడు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సేవను పరమోద్దేశ్యంగా తీసుకుని నిరంతరం ప్రజల మధ్య ఉండి పనిచేసిన నాయకుడిగా లక్ష్మారెడ్డి పాత్ర విశేషమని సీఎం స్మరించుకున్నారు. ఆయన రాజకీయ ప్రయాణం ఎంతగా ప్రజలకు అండగా నిలిచిందో, అంతే స్థాయిలో సామాజిక రంగంలోనూ తమ సానుభూతి స్వభావంతో గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. జర్నలిజం పట్ల ఉన్న ఆసక్తితో వార్తా సంస్థను స్థాపించడం ద్వారా మీడియా రంగానికి కొత్త దారులు చూపిన వ్యక్తిగా లక్ష్మారెడ్డి సేవలను సీఎం గుర్తుచేశారు. అలాగే హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో మీడియా వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు నడిపిన విషయాన్ని ప్రశంసించారు. కొండా లక్ష్మారెడ్డి మరణం ప్రజా వర్గాలకు, ముఖ్యంగా మీడియా మరియు రాజకీయ రంగాలకు తీరని లోటని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాసేవ అనే పవిత్ర మార్గంలో నిబద్ధతగా నడిచిన నాయకుడిని రాష్ట్రం కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు, అభిమానులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073